క్లుప్తంగా

పోషకాలు తల్లీబిడ్డకు మేలు


గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లు అందజేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ అధికారి చంద్రప్రకాశ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 22మంది గర్భిణులకు పోషకాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గర్భిణులకు సుఖప్రసవం, అనంతరం పుట్టిన బిడ్డకు ఈ పోషకాలు మేలు చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నోట్‌బుక్స్, రాగిజావ పంపిణీ

కుల్కచర్ల: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ హబీబ్ అహ్మద్ చెప్పారు. గురువారం చౌడాపూర్ మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత నోటుపుస్తకాలు, రాగిజావ, బెల్లంను బడులకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకొని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు తిమ్యా, రాములు, సీఆర్పీలు రాఘవేందర్, విజయ్‌కుమార్, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: మండల పరిధి పోతిరెడ్డిపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు విద్యార్థులకు గురువారం రాగిజావా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో రోగనిరోధక శక్తితో పాటు జ్ఞాపకశక్తిని పెంచేందుకు రాగిజావా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జావాను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఏఐఏవైఎస్ జిల్లా ఇన్‌చార్జిగా అంజిలయ్య

బొంరాస్‌పేట: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం (ఏఐఏవైఎస్) వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా మండల పరిధి నాందార్‌పూర్‌కు చెందిన బ్యాగరి అంజిలయ్యను నియమించారు. కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్ సమక్షంలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా అంజిలయ్యను సన్మానించి నియామకపత్రాన్ని అందజేశారు.

గల్లీల్లో 'గృహలక్ష్మి' సందడి


పూరిగుడిసె వద్ద దరఖాస్తుల పరిశీలన

బొంరాస్‌పేట: గల్లీగల్లిలో గృహలక్ష్మి దరఖాస్తు పరిశీలన సందడి నెలకొంది. తాము అర్జీ పెట్టుకున్నామని, ఏమైందని అధికారులను ప్రజలు చుట్టుముడుతున్నారు. అర్జీ పెట్టుకున్న నిరుపేదలు, వారి గుడిసెలు, ఖాళీ స్థలాలను పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, వీఎస్‌ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ్మడిగా విచారణ జరుపుతున్నారు. రెండో రోజు గురువారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని లగచర్ల, రేగడి మైలారం, పలు తండాల్లో అర్జీలను పరిశీలించి, అర్హులను గుర్తించారు.

వంట.. బిల్లుల తంటా!

మధ్యాహ్న భోజనం బిల్లులు అందక సిబ్బంది నిరీక్షిస్తున్నారు. పూట గడవని కుటుంబాల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు నెలల నుంచి బిల్లుల జాడ లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అప్పులు దొరకక.. దొరికినా.. సకాలంలో వడ్డీలు కట్టలేక పథకానికి స్వస్తి పలకాలని చర్చించుకుంటున్న వైనంపై 'సాక్షి' కథనం..

- ఆరు నెలలుగా పేరుకుపోయిన మధ్యాహ్న భోజన పథకం బకాయిలు
- నిరాశలో నిర్వాహకులు
- పథకానికి స్వస్తి పలికేందుకు సిద్ధం!
- పాకశాలలు లేక పాఠశాల ఆవరణలోనే వంటావార్పు



ఊరెంటితండా పాఠశాలలో వంట గది లేక బడి వరండాలో వంట చేస్తున్న నిర్వాహకురాలు

పెద్దేముల్: మధ్యాహ్న భోజనం పథకానికి ప్రభుత్వం ఇచ్చే బిల్లులకు, మార్కెట్లో పెరిగిన నిత్యవసరాల (కూరగాయలు తదితర సామగ్రి) ధరలకు పొంతన లేకుండా ఉందని నిర్వాహకులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు నెలలకు ఒకసారి బిల్లులు రావటంతో ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నామని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అల్లాడుతున్నామన్నారు. పిల్లలకు కడుపునింపుతున్నామని ఆనందపడాలో.. చేసిన కష్టానికి ఫలితం లేక స్కీంను వదులుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు.

వంటగదులు కరువు

పెద్దేముల్ మండలంలో 61 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సుమారు 5,038 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారు 45 పాఠశాలలకు వంటశాల లేదు. ఆరు బయట లేదా, బడి ఆవరణలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. కనీసం ఉన్నత పాఠశాలల్లో మరుగు దొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

ఆదుకుంటున్న ఉపాధ్యాయులు

పథకంలో 90 శాతానికి పైగా విద్యార్థులు అక్కడే భోజనాలు చేస్తున్నా, ప్రభుత్వం బిల్లులు ఇవ్వడంతో అశ్రద్ధ చేస్తుందని నిర్వాహకులు ఆరోపించారు. మార్కెట్లో రూ.100నుంచి రూ.150 వరకు టమాట, రూ.100 నుంచి రూ.120 వరకు మిర్చి, రూ.120కిలో బీన్నీసు, రూ.200కిలో అల్లం వెల్లుల్లికి ధరలు ఉన్నాయి. భోజనం వండేందుకు ఇవన్నీ నిత్యవసరాలే. ఖరీదు చేయక తప్పదు. వంటలు వండక తప్పడం లేదని అంటున్నారు. ఏ నెలకు ఆనెల బిల్లులు చెల్లిస్తే.. లాభం సంగతి ఎలా ఉన్నా.. అప్పుల తిప్పలు తప్పేవని, ఇలా నాలుగైదు మాసాలకు ఒకసారి బిల్లులు ఇస్తే వంటలు చేసేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇందూరు ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో నిర్వాహకులు మధ్యాహ్న భోజనం గిట్టడం లేదని, మానుకుంటామని చెబుతున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులు వారికి డబ్బులు ఇచ్చి పథకాన్ని కొనసాగిస్తున్నారు.

జనవరి నుంచి బిల్లుల్ నిల్

1నుంచి 8వ తరగతి వరకు ఏప్రిల్ నుంచి, 9, 10 తరగతులకు జనవరి నుంచి పథకం బిల్లులు లేవని సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. ప్రతి నెల మండలంలో సుమారు రూ.6.5లక్షలు బిల్లు అవుతుంది. 1 నుంచి 5వ తరగతి వరకు రూ.1.8లక్షలు, యూపీఎస్ (6,7,8) రూ.1.5లక్షలు, హైస్కూల్ (9,10) తరగతులకు రూ.1.6లక్షలు, దానికి తోడు గుడ్లకు రూ.1.7లక్షలు వరకు ప్రతి నెల బిల్లు అవుతున్నట్లు సమాచారం. ఒక విద్యార్థికి ప్రైమరీలో రూ.4.75 పైసలు, హైస్కూల్‌లో రూ6.97 పైసలు, వారంలో మూడు సార్లు గుడ్డు ఇవ్వ వలసి ఉంటుంది. ప్రభుత్వం ఒక గుడ్డుకు రూ.4 చెల్లించగా.. మార్కెట్లో రూ.5.50 నుంచి రూ.6 వరకు ధర పలుకుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

"ఇబ్బంది పడుతున్నాం



రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు మావి. నిత్యం కూలీ పనిచేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటాం. బిల్లులు సకాలంలో రాక అప్పులు తెచ్చి భోజనం వండుతున్నాము. నెలకు రూ.6వేల నుంచి 8వేల వరకు ఖర్చు అవుతుంది. పైసలు రాకపోతో ఉపాధ్యాయులు ఆదుకుంటున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచడంతో పాటు.. నెలనెలా చెల్లిస్తే ఇబ్బంది ఉండదు.

– సక్రిబాయి, పాషాపూర్‌తండా భోజన నిర్వాహకురాలు

బిల్లుల ఆలస్యం వాస్తవం



మధ్యాహ్న భోజన పథకం బిల్లులు ఆలస్యం వాస్తవమే. గ్రామాల్లో నిర్వాహకులు పడుతున్న ఇబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఇక ధరల విషయం అందరికీ తెలిసిందే. ప్రతి నెలా బిల్లులు వచ్చేలా కృషి చేస్తాం. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం విజయవంతంగా అమలయ్యేలా చుస్తాం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు గ్రామ పెద్దల సహకారం అవసరం.

– వెంకటయ్య, ఎంఈఓ పెద్దేముల్"


అగ్నిహోత్రం పూజలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు

వైభవంగా నిత్య అగ్నిహోత్రం

తాండూరు టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యసమాజ్‌లో నిత్యం జరిపే అగ్నిహోత్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పూజలో బీఆర్ఎస్ కౌన్సిలర్ రాఘవేందర్, సరిత దంపతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆర్యసమాజ్ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

సీసీల ఏర్పాటుపై అవగాహన

దౌల్తాబాద్: సీసీ కెమెరాల ఏర్పాటుపై దౌల్తాబాద్ మండలం బాలంపేట గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ రమేష్ కుమార్ మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు, దొంగతనాలు అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే దౌల్తాబాద్‌లో 36 కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్ రావు, ఎంపీటీసీ వెంకటప్ప పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

మండల విద్యాధికారి హరిశ్చందర్


మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

పరిగి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. గురువారం పరిగి మండలం సయ్యాద్‌మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ, విద్యార్థులు కూర్చోవడానికి డ్యూయల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ విద్యా బోధన తరగతి గదిని ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు బడులకు దీటుగా సర్కారు బడులు కొనసాగుతున్నాయని, అందుకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు, దాతల సహకారం ఎనలేనిదని ఎంఈఓ చెప్పారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని విద్యను బోధించాలని టీచర్లకు చెప్పారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫాయూం సుల్తానా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలపై ద్వంద్వ వైఖరి తగదు

- వెంటనే వారిని రెగ్యులర్ చేయాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- సమ్మెకు సంఘీభావం


సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మెలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ కోరారు. సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలకు గురువారం ఆ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్ అండ్ హెల్త్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ప్రభుత్వం.. సెకండ్ ఏఎన్‌ఎంలను పట్టించుకోకపోవడం మంచిది కాదన్నారు. ఒకే శాఖకు చెందిన ఉద్యోగుల విషయంలో ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తుందని దుయ్యబట్టారు. ఇటీవల ఏఎన్‌ఎంల భర్తీ కోసం వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి, ఉన్నవారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కావలి సంతోష్, రాజుగౌడ్, వెంకటయ్య, భీమ్‌శంకర్ ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

అర్హులందరూ ఓటుహక్కు కలిగి ఉండాలి: తహసీల్దార్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఆర్‌ఐ

పెద్దేముల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం జనగాం, కొండాపూర్, మన్‌సాన్‌పల్లి, దుగ్గాపూర్ తదితర గ్రామల్లోని పోలింగ్ కేంద్రాలను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రాజిరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. గ్రామానికి కేంద్రం ఎంత దూరంలో ఉంది లాంటి తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో తమసీల్దార్ మాట్లాడారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది వజ్రాయుధం లాంటిదని, దానిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

హామీలు మరిచిన ప్రభుత్వం

- అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇవ్వాలి
- బీజేపీ శ్రేణులు ధర్నా
- తహసీల్దార్లకు వినతుల అందజేత


తాండూరు టౌన్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన బీజేపీ శ్రేణులు

దౌల్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు డబుల్‌బెడ్రూం, నిరుద్యోగభృతి, కేజీ టూ పీజీ విద్య తదితర పథకాలను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు చాంద్ పాషకు వినతిపత్రం అందజేశారు. నాయకులు నర్సింహులు, కూరవెంకటయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ..

పూడూరు: అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీలను మరచిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా నాయకులు వెంకటయ్య, రవీందర్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్, బుచ్చన్న, బాలరాజ్, సత్యనారాయణ, సుభాన్ ఉన్నారు.

పేదల సంక్షేమం పట్టని ప్రభుత్వం

తాండూరు టౌన్: ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పేదల సంక్షేమం విస్మరించిదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో నీరు, నిధులు, నియామకాలు అన్నీ మనకే దక్కుతాయని చెప్పిన కేసీఆర్.. ముఖ్యమంత్రి అయ్యాక మాట తప్పారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు భృతి చెల్లింపు, ఉద్యోగాల భర్తీ మరిచారని మండిపడ్డారు. అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, కౌన్సిలర్లు లావణ్య, శ్రీలత, లలిత, బాలప్ప, నాయకులు భద్రేశ్వర్, ఆంజనేయులు, కిరణ్, రాజు, సతీష్, సంజీవ్, చందు, ప్రకాష్, సంగమేశ్వర్, భానుపవార్, బీరప్ప ఉన్నారు.

గృహలక్ష్మి పేరుతో మోసం

పరిగి: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఆ పార్టీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు తొమ్మిదేళ్లుగా ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ అవి నెరవేర్చక పోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో చాలా మంది పేదలు సొంత ఇల్లు లేక రోడ్డుపై జీవిస్తున్నారని, ప్రభుత్వం ఏమైనా పథకాలు తీసుకువస్తే వాటిని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పంచి పెడుతుందని విమర్శించారు. ప్రజలకు డబుల్‌బెడ్‌రూం ఆశ చూపి, ఇప్పుడు గృహలక్ష్మి పేరుతో మరో మోసం చేస్తుందని మండిపడ్డారు. అధికార పార్టీ సర్పంచులే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.


పూడూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

600మందికి రుణమాఫీ

మోమిన్‌పేట: మోమిన్‌పేట పీఏసీఎస్‌లో ఇప్పటి వరకు 600మంది రైతులకు రుణమాఫీ అయిందని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ విడతల వారీగా చేపట్టిందన్నారు. గతంలో రూ.44వేల వరకు చేసిన రుణమాఫీ, ప్రస్తుతం రూ.97వేల వరకు చేసిందని, ప్రస్తుతం 233మంది రైతులకు రూ. 1కోటి 8 లక్షల 91వేల 107లను విడుదల చేసిందని పేర్కొన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

ధారూరు: పక్షం రోజులు ఏకధాటి వర్షాల అనంతరం వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు నేల చూపులు చూడటం, నేలలు నెర్రలు వారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రూ.వేలు, లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలు క్రమంగా ఎండుముఖం పట్టాయి. కొన్ని చోట్ల పొలాలు బీటులు వారి రైతుల్ని దుఃఖసాగరంలో ముంచెత్తాయి. ఒకటి, రెండు రోజుల్లో వానలు పడకపోతే పంటలపై ఆశ వదులు కోవాల్సి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


ఎండుముఖం పట్టిన మొక్కజొన్న


కేరెళ్లి గ్రామ సమీప ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

రహ'దారుణం'

ప్రధాన రహదారి దుస్థితి.. ఎవరికీ పట్టని పరిస్థితి

- కంకర తేలి, దుమ్ముధూళితో వాహనదారుల ఇక్కట్లు

ధారూరు: ధారూరు–వికారాబాద్ ప్రధాన రోడ్డు మార్గం కంకరతేలి వాహనదారులకు చుక్కలు చూపెడుతోంది. తాండూర్–హైదరాబాద్ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, అలాంటి రోడ్డు దుస్థితి ఇంత దారుణంగా ఉంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు స్కిడ్‌అయి కిందపడి, సారథులు, ప్రయాణికులు గాయాల పాలవుతున్నట్లు సమాచారం. ఇక పెద్దవాహనాలు వెళ్లినప్పుడు దుమ్ముధూళి గాలిలో లేచి, వెనకాల వస్తున్న వాహనదారులకు ఇబ్బంది కరంగా మారిందని స్థానికులు తెలిపారు. కేరెళ్లి గ్రామ సమీపంలో రోడ్డు పరిస్థితి ఇలాగే ఉందని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతుల్లో మమ!

మరమ్మతులు చేయించాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సిబ్బంది తాత్కాలిక పనులు చేపట్టి మమా అనిపిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కంకర, డాంబర్ కలిపిన మిశ్రమాన్ని కలిపి గుంతల్లో పోసి, పైనుంచి డస్ట్ పోయించేవారని, ప్రస్తుతం మట్టితో కూడిన కంకర గుంతల్లో పోసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు చొరవతీసుకొని పటిష్ట మరమ్మతు, లేదా కొత్తగా రోడ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

❖ డిప్యూటీ సీఈవోలుగా ప్రమోషన్లు ఇవ్వాలి



అనంతగిరి: రాష్ట్ర వ్యాప్తంగా ఏళ్ల తరబడి ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారిని వెంటనే డిప్యూటీ సీఈఓలుగా ప్రమోషన్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు సత్తయ్య కోరారు. ఈ మేరకు గురువారం వికారాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఇతర ఎంపీడీవోలు పాల్గొన్నారు

❖ గృహలక్ష్మితో పేదలకు లబ్ధి

దోమ: గృహలక్ష్మి పథకంతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇంటిటికీ తిరుగుతూ గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలిన చేపట్టారు. అర్జీ దారుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి పథకం వర్తిస్తుందని తెలిపారు.

❖ పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

మోమిన్‌పేట: ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గీత చెప్పారు. గురువారం మోమిన్‌పేట మండలం చంద్రాయన్‌పల్లిలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఆవులు, బర్రెలు గర్భకోశ సంబంధిత వ్యాధుల బారిన పడతాయని, వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఇందులో సర్పంచ్ అంజయ్య, ఉప సర్పంచ్ ఉన్నారు.

❖ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

వికారాబాద్ అర్బన్: పేద విద్యార్థులకు సహాయం అందించేందుకు ముదిరాజ్ సేవా సమితీ సభ్యులు ఎప్పుడు ముందుండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ సూచించారు. గురువారం పట్టణంలోని ఓ విద్యాలయంలో కుమ్మరిగూడ గ్రామానికి చెందిన పల్లె అంజయ్య ముదిరాజ్ విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఇందులో ప్రిన్సిపల్ నాగయ్య, ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బి.ఆర్. శేఖర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, వెంకటయ్య ఉన్నారు.

❖ గిరిజనులకు ఉచిత వైద్య శిబిరం

బొంరాస్‌పేట: హమ్ బంజారా యూత్ అసోసియేషన్ (హెచ్‌బీవైఏ) ఆధ్వర్యంలో బొంరాస్‌పేట మండలం కుబ్యానాయక్‌తండాలో గిరిజనులకు గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు, చిన్నపిల్లలకు సుమారు 180మందికి సేవా సమితీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఇందులో డాక్టర్లు హేమల్‌కుమార్, అక్షయ్, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు వనిత, కార్యవర్గ సభ్యులు వినోద్, గోపి, అనిల్ తదితరుల పాల్గొన్నారు.

❖ పోలింగ్ స్టేషన్ పరిశీలన

యాలాల: నూతన తహసీల్దార్‌గా కసిని పద్మావతి గురువారం విధుల్లో చేరారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఆమెను మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయగా.. పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలింగ్ స్టేషన్‌కు కేటాయించిన స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వాహణలో భాగంగా ఏర్పాట్లపై ఆమె డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌తో చర్చించారు.

❖ ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కుల్కచర్ల గ్రామానికి చెందిన పగిడ్యాల్ బచ్చయ్య అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ ఆనందం, టీడీపీ జిల్లా నాయకులు బాల ముకుందం, ఆంజనేయులు, బాలయ్య, రాములు, బాలచందర్, కృష్ణ ఉన్నారు.

❖ బాధిత కుటుంబానికి పరామర్శ

కొడంగల్: మండల పరిధి రావులపల్లిలో చనిపోయిన బీఆర్ఎస్ కార్యకర్త శ్యామప్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గురువారం పరామర్శించి మాట్లాడారు. శ్యామప్ప చనిపోవడం వారి కుటుంబానికి తీరని లోటని, వారికి అండగా ఉంటామని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, బాకారం అరుణ్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

❖ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పలువురి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శరీరంపై గోదుమరంగులో కాని, రాగివర్ణంలో కాని మచ్చలు ఏర్పడితే లెప్రసీ కేసుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది యాదమ్మ, సుజాత, సునిత, విజయలక్ష్మి ఉన్నారు

❖ అసెంబ్లీ టికెట్ నాకే ఇవ్వండి!

తాండూరు: తాండూరు అసెంబ్లీ నుంచి ఈ సారి బరిలో నిలబడతానని ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్కను కలిసి టికెట్ తనకే ఇవ్వాలని రమేష్ కోరినట్లు సమాచారం.

❖ రెగ్యులర్ చేయాలి



అనంతగిరి: ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి, పేస్కేల్ ఇవ్వాలని వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.